ప్రజాశక్తి

గురువారం 2 మే 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

మేడే స్ఫూర్తితో పోరాటాలు



గాజువాకలో నిర్వహించిన భారీ ప్రదర్శనలో సిహెచ్.నర్సింగరావు, కార్మికులు

- ప్రభుత్వ రంగాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి
- కార్మిక దినోత్సవాన సభలు, సమావేశాల్లో వక్తల పిలుపు
- వాడవాడలా ఎగిరిన ఎర్రజెండా

విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మేడే వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వాడవాడలా కార్మిక జెండా ఎగిరింది. విశాఖ నగరంలో భారీ కార్మిక ప్రదర్శనలు జరిగాయి. మేడే స్ఫూర్తితో పోరాటాలు సాగిస్తామని కార్మికులు ప్రతినబూనారు. ప్రభుత్వ రంగాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సి ఉందని వక్తలు పిలుపునిచ్చారు.

ప్రజాశక్తి - గాజువాక : మేడే సందర్భంగా గాజువాకలోని 60 అడుగుల రోడ్డులో బుధవారం సాయంత్రం బహిరంగ సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చేందుకు బిజెపి ప్రయత్నిస్తోందన్నారు. మోడీ సర్కారు రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిందని తెలిపారు. అయినప్పటికీ వైసిపి, టిడిపిలు దానికి మద్దతు తెలపడం దారుణమన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల పేరిట మోడీ యువతను ఎలా మోసం చేశారో నర్సింగరావు వివరించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఎలా నిర్వీర్యం చేస్తున్నారో తెలియజెప్పారు. దేశంలో శ్రామికరాజ్యం స్థాపన జరగాలన్నారు. అప్పుడే ఉచిత విద్య, వైద్యం మిగతా 2లో..



మద్దిలపాలెంలో మాట్లాడుతున్న ఎంవిఎస్.శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న రెంగరాజన్

అభ్యర్థులు ఆర్థిక లావాదేవీల

రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలి

పార్లమెంటు నియోజకవర్గ వ్యయ పరిశీలకులు రెంగరాజన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలని, అన్ని కార్య కలాపాలను ప్రత్యేక బ్యాంకు ఖాతా ద్వారా మాత్రమే చేపట్టాలని పార్లమెంటు నియోజకవర్గ వ్యయ పరిశీలకులు రెంగరాజన్ పేర్కొన్నారు. విశాఖ పార్లమెంటు పరిధిలో పోటీ చేస్తున్న అభ్యర్థులందరితో బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎన్నికల వ్యయానికి సంబంధించిన రిజిస్టర్ల నిర్వహణ, బిల్లుల చెల్లింపు తదితర అంశాలపై వారికి అవగాహన కల్పించారు. ప్రతి అభ్యర్థి తను చేసిన వ్యయానికి సంబంధించిన బిల్లులను అధికారులకు సమర్పించాలని సూచించారు. రూ.10 వేలకు మించి చేసే ప్రతి లావాదేవీ చెక్కు లేదా డీడీ రూపంలో జరగాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ క్రమంలో అభ్యర్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. వారు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం అభ్యర్థుల ఖాతా బుక్కులను తనిఖీ మిగతా 2లో..

పనుల పేరిట తవ్వేసారు.. వదిలేశారు..

వార్త 7లో..

బిజెపి అభ్యర్థులను ఓడించాలి : చలసాని

వార్త 7లో..

మెయిన్ రోడ్డులో వ్యక్తి దారుణ హత్య

వార్త 6లో..



అచ్యుతాపురం సభలో మాట్లాడుతున్న పవన్ కల్యాణ్

వైసిపిని సముద్రంలో కలిపేయండి

- విశాఖను జగన్ భూ ఆక్రమణలమయం చేశారు
- ఎన్నికల సభల్లో జనసేన అధినేత పవన్

వార్త మెయిన్‌లో..

మాటల యుద్ధం తప్ప

అభివృద్ధి ఊసే లేదు

పాయకరావుపేట సభల్లో చంద్రబాబు, జగన్‌లది ఒకటే తంతు



పాయకరావుపేట సభలో మాట్లాడుతున్న జగన్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో మూతపడ్డ సహకార సుగర్ ఫ్యాక్టరీలకు వైసిపి, టిడిపి ప్రభుత్వాల్లో మోక్షం లభించేలా లేదు. తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తామన్న మాట ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, జగన్మోహన్ రెడ్డిల నోట రావడం లేదు. జిల్లాలోని పాయకరావుపేటలో ఆ ఇద్దరూ కొద్ది రోజుల వ్యవధిలో బహిరంగ సభలు నిర్వహించారు. సరిగ్గా పక్షం రోజుల కిందట వచ్చిన చంద్రబాబు తన ప్రసంగంలో ఎక్కడా జిల్లా అభివృద్ధికి తాను ఏం చేస్తానన్న విషయం చెప్పలేదు. బుధవారం మేమంతా సిద్ధం సభకు వచ్చిన జగన్‌దీ అంతే తంతు. ఏ ప్రభుత్వం వచ్చినా ఫ్యాక్టరీల ఆస్తులు అమ్మి సొమ్ము చేసుకునేలా వాతావరణం ఉంది. ఇప్పటి వరకూ చేసిన పొరపాటును గుర్తించి చెరుకు రైతులు, కార్మికులకు జరిగిన నష్టాన్ని తెలుసుకొని వైసిపి, టిడిపి సరిదిద్దుతాయన్న ఆశ ఏ మూలా రైతుల్లో కనిపించడం లేదు. అధికారంలోకి రావడం కోసం భ్రమలు పెట్టడం తప్ప జిల్లాలోని ప్రధానమైన స్థానిక సమస్యలపై అటు జగన్, ఇటు బాబు ఎవ్వరూ మాట్లాడ్డం లేదు. బుధవారం నాటి పాయకరావుపేట సభలో సుగర్ ఫ్యాక్టరీల విషయంపై జగన్ హామీ ఇస్తారని అంతా అనుకున్నా వాటి ప్రస్తావన రాలేదు. తీర ప్రాంత మత్స్యకారుల ఉపాధి సమస్యపైనా ఏ హామీ ఇవ్వలేదు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాల కల్పనపై గ్యారంటీ ఇవ్వలేదు. ఎంతసేపూ మిగతా 2లో..



ప్రజాగళం సభలో మాట్లాడుతున్న చంద్రబాబు (ఫైల్)

మొదటి పేజీ తరువాయి..



విశాఖ నగరంలో సాగుతున్న కార్మిక ప్రదర్శన

సాధ్యమన్నారు. చైనాలోనూ, క్యూబాలోనూ ఉచిత విద్య, వైద్యం అమలు తీరును వివరించారు. దోపిడీదారులు ఉన్న చోట్ల కార్మికుల పోరాటం మరింత పదునెక్కాలన్నారు. సిఐటియు గాజువాక జోన్ అధ్యక్షులు డి.రమణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో శ్రామిక మహిళ కన్వీనర్ పి.మణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు రామారావు, యు.శ్రీనివాసరాజు, పి.వెంకటరెడ్డి, ఎం.రాంబాబు పాల్గొన్నారు. తొలుత శ్రీ కన్య థియేటర్ జంక్షన్ నుంచి పాత గాజువాక వరకూ ప్రదర్శన చేపట్టారు. మేడే అమరవీరులకు నివాళ్లర్పించారు. మేడే వేడుకల్లో భాగంగా ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కార్మిక హక్కులను కాపాడుకోవాలి : ఎంవిఎస్.శర్మ

ఎంవిపి.కాలనీ : మేడే స్ఫూర్తితో కార్మిక హక్కులను రక్షించుకోవాలని, ఈ నెల 13న జరుగుతున్న ఎన్నికల్లో కార్మికవర్గ నాయకులను గెలిపించుకోవాలని ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఎంవిఎస్.శర్మ పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలోని సిపిఎం జిల్లా కార్యాలయం వద్ద మేడే వేడుకలు జరిగాయి. పీతల అప్పారావు, సూరిబాబు, లక్ష్మి, శర్మ, సుధాకర్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం జరిగిన సభలో శర్మ మాట్లాడుతూ మోడీ సర్కారు కార్మికుల హక్కులపై ఎలా దాడి చేస్తోందో తెలిపారు. దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను అంబానీ, అదానీ, జిందాల్ వంటి కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారన్నారు. రాజ్యాంగ హక్కులకు పాలకులు భంగం కలిగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, నాయకులు అనపర్తి అప్పారావు, పి.వెంకటరావు, కె.కుమారి, త్రినాథరావు, జివి.రమణ, ప్రదీప్, పివి.రమణ, చంటి పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : మేడే స్ఫూర్తితో కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే ఉత్సవాలు విశాఖ జిల్లాలో ఘనంగా జరిగాయి. ఉదయం 6 గంటల నుంచే ఎర్ర జెండాలు రెపరెపలాడాయి. విశాఖలో సుమారు 400 ప్రాంతాల్లో మేడే పతాకావిష్కరణలు జరిగాయి. పతాకావిష్కరణ జరిగిన చోట కార్మికులతో మేడే ప్రతిజ్ఞ చేయించారు.

జగదాంబ సిఐటియు కార్యాలయం నుంచి ఓ ఆప్టెక్స్, వాచ్‌హౌస్, సిఎంఆర్, చిత్రాలయ, జివిఎంసి జోన్ – 5 ఆఫీస్ మీదుగా భారీ కార్మిక ప్రదర్శన జరిగింది. జగదాంబ సిఐటియు కార్యాలయం వద్ద సంఘం పూర్వ జిల్లా అధ్యక్షులు వివిఎస్.పద్మనాభరాజు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 138 సంవత్సరాల క్రితం 8 గంటల పని దినం కోసం కార్మికులు తమ ప్రాణాలను త్యాగం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. సంఘం ప్రస్తుత జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో వున్న బిజెపి ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందన్నారు. కార్యక్రమంలో ఎం.సుబ్బారావు, పి.మణి, వై.రాజు, జి.పోలేశ్వరరావు, ఎం.సూరీడు, టి.నూకరాజు, ఎం.ఈశ్వరరావు, కె.నరసింగరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జివిఎంసి నీటి సరఫరా టిఎస్‌ఆర్ కాంప్లెక్స్ వద్ద జివిఎంసి వాటర్ ఫిల్టర్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు పి.వెంకటరెడ్డి మేడే జెండా ఆవిష్కరించారు. ఆటోనగర్‌లోని విసూవియస్ కంపెనీ గేటు వద్దా ఆయన జెండా ఎగురవేశారు. ఎం.వెంకటరావు, ఎం.రాము పాల్గొన్నారు.

సెవెన్ హిల్స్ హాస్పిటల్ వద్ద జరిగిన మేడే వేడుకల్లో భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) అధ్యక్షులు కె.నర్సింగరావు, నాయుడు పాల్గొన్నారు. రామ్ నగర్ జంక్షన్లో దుర్గారావు ఆధ్వర్యంలో చిట్టిబాబు పతాక ఆవిష్కరణ చేశారు. పంది మెట్ట జంక్షన్‌లో జరిగిన కార్యక్రమంలో సూరి అప్పారావు, మేస్త్రి నాయుడు పాల్గొన్నారు. సింగ్ హోటల్ జంక్షన్ వద్ద సింహ నాయుడు, బుజ్జి పాల్గొన్నారు.

ఎపి మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో కెజిహెచ్ ఆవరణలో పతాకాన్ని ఆవిష్కరించారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేంద్రంలోని బిజెపి కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని తెలిపారు. కోరమండల్ గేటు ఎదురుగా ఎఐటియుసి జెండాను సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి ఎగురవేశారు.

గాజువాక : ఆటోనగర్‌లోని ప్రజాశక్తి విశాఖ ఎడిషన్ కార్యాలయంలో అరుణపతాకాన్ని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు డిసిహెచ్.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రిజిస్టర్లను పక్కాగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి..) చేశారు. వాటి నిర్వహణలో అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ నెల 6, 11వ తేదీల్లో అభ్యర్థులందరూ మరొకసారి వారి రిజిస్టర్లను వ్యయ పరిశీలకుల సమక్షంలో చూపించాల్సి ఉంటుందని వ్యయ పరిశీలకులు రెంగరాజన్ ఈ సందర్భంగా సూచించారు. సమావేశంలో నోడల్ అధికారి గణపతి, పార్లమెంటు నియోజకవర్గ ఎంఇఒలు, ఇతర అధికారులు, పోటీ చేసే అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత ఇవిఎంల ర్యాండమైజేషన్ పూర్తి

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తూర్పు నియోజకవర్గానికి చెందిన ఇవిఎంల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయింది. బుధవారం కలెక్టర్ కార్యాలయ వీడియో సమావేశ మందిరంలోని వీసీ హాలులో ఎన్నికల సాధారణ పరిశీలకులు అమిత్ శర్మ, తూర్పు రిటర్నింగ్ అధికారి, జెసి కె.మయూర్ అశోక్‌తో కలిసి ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్ లైన్ ద్వారా పూర్తిచేశారు.

ఇవిఎంల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో తూర్పు నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఇవిఎంల వినియోగంపై ఆంధ్రా యూనివర్శిటీలోని న్యూ క్లాస్ రూమ్ కాంప్లెక్సులో బుధవారం శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో తూర్పు నియోజకవర్గ ఆర్ఒ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పాల్గొని కమిషనింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఇవిఎంల వినియోగంపై అవగాహన కల్పించారు. విధుల్లో భాగస్వామ్యమయ్యే ప్రతి ఒక్కరూ ఇవిఎంల వినియోగం గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని, సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు

మాటల యుద్ధం తప్ప అభివృద్ధి ఊసే లేదు

(మొదటి పేజీ తరువాయి..)

పథకాలు గురించి చెప్పడం, విమర్శలు చేయడం మినహా ప్రధాన పార్టీలు రెండూ అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌పై టిడిపి చేస్తున్న దుష్ప్రచారంపై జగన్ పాయకరావుపేట సభలో వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారు. జగన్ భూములు ఇచ్చేవాడేగానీ భూములు లాక్కునేవాడు కాదని అన్నారు.

భిన్నంగా ఇండియా బ్లాక్ ప్రచారం

ఇండియా బ్లాక్ అభ్యర్థులను గెలిపించాలంటూ ఇటీవల పాయకరావుపేటకు ప్రచారానికి వచ్చిన పిసిసి అధ్యక్షురాలు వైఎస్.షర్మిల మాత్రం తన ప్రసంగంతో ఆకట్టుకున్నారు. జిల్లాలోని సమస్యలను ఆమె ప్రస్తావించారు.

ఈ ప్రాంతంలో నష్టపోతున్న చెరుకు రైతుల గురించి ఆమె మాట్లాడారు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపికి మద్దతునిస్తున్న టిడిపి, వైసిపిలను తరిమికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. ఇండియా బ్లాక్‌లోని కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ గెలిస్తే ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు పాటుపడతాయన్నారు. అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు.

FORMAT C-1

Declaration about criminal cases

(As per the judgement dated 25th September 2018 of Hon'ble Supreme Court in W.P (civil) No: 536 of 2011) (Public Interest foundation & Ors Vs. Union of India & Anr.)

Name and address of Candidate : **Ganesh Kumar Vasupalli son of Late V.Ramana,aged 60 (Sixty) years, resident of D No. 38-35-7, Ranaprathap Nagar, Marripalem, Visakhapatnam-530018..**

Name of Political Party : **YUVAJANA SRAMIKA RAITHU CONGRESS PARTY (YSRCP)**

(Independent candidates should write "Independent: here)

Name of Election : **GENERAL ELECTIONS HOM/APLA-2024**

Name of Constituency : **VISAKHAPATNAM SOUTH CONSTITUENCY (22)**

I, Ganesh Kumar Vasupalli , a candidate for the above mentioned election, declare for public information the following details about my criminal antecedents.

S. NO	Pending criminal cases			Details about case of conviction for criminal offences	
	Name of Court	Case No and status of case	Section (s) of acts concerned and description of offence(s)	Name of court & date (s) of order (s)	Description of offence (s)& punishment imposed
1	Not Applicable	1.Cr.No.364/2019 pending with Air Port Zone Police Station, Kancharapalem, Visakhapatnam	Under Section 353, 341, R/w 34 of IPC as A-9	Not Applicable	Not Applicable
2	before the Honourable High Court of Andhra Pradesh Amaravathi	Clr Appeal 635/2023.	Under Section 324 of IPC	Additional Metropolitan Sessions Judge at Visakhapatnam dated 11-08-2023	In S.C 92/2019 the Honourable Additional Metropolitan Sessions Judge at Visakhapatnam convicted the accused for rigorous imprisonment for a period of six months and amount fine of Rs.5000/- the same was suspended by the Honourable High Court until disposal of Crl. Appeal No.635/2023.
3	before the Honourable Special Court for MPs and MLAs held at Vijayawada.	3.C.C.No. 8/2022	171 H, 341, 188 R / W 34 IPC	Not Applicable	Not Applicable
4	before the Honourable Special Court for MPs and MLAs at Vijayawada.	C.C 10/2022	171 H, 188 IPC	Not Applicable	Not Applicable

*In the case of election to Council of States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of constituency.

Sd/- (Ganesh Kumar Vasupalli)
VISAKHAPATNAM SOUTH CONSTITUENCY (22)

వెల్లివిరిసిన కార్మిక చైతన్యం

వాడవాడలా మేడే వేడుకలు.. అరుణ పతాకావిష్కరణలు


మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

ప్రపంచ కార్మిక దినోత్సవం, మేడే వేడుకలను పలుచోట్ల ఘనంగా జరుపుకున్నారు. కార్మిక పతాకాన్ని ఆవిష్కరించి, దానికి గౌరవవందనం సమర్పించారు. పోరాడి సాధించుకున్న హక్కులను పరిరక్షణకు అవసరమైతే మళ్లీ ఉద్యమిద్దామని ప్రతిన పూనారు.

ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం

ఉక్కునగరం : మే డే స్ఫూర్తితో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందామనిసిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో ప్రధాన పరిపాలన భవనం ఎదుట మే డే కవాతును, జెండా ఆవిష్కరణ జరిగింది. స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి కార్మికులతో మేడే ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని నేటి పాలకులు కాల రాస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. కార్మిక చట్టాలను లేబర్ కోడ్స్‌గా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మార్చేస్తుంటే దాన్ని రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు సమర్ధించడం శోచనీయమన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అంతం చేయేలా బిజెపి చర్యలున్నాయని విమర్శించారు. 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి గంగారావు మాట్లాడుతూ హక్కుల రక్షణకు కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. స్టీల్ సిఐటియు గౌరవాధ్యక్షులు జె అయోధ్యరాం, అధ్యక్షులు వైటిదాస్, ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, సీనియర్ నేత ఎన్. రామారావు, పి శ్రీనివాసరాజు, బి అప్పారావు, గంగాధర్, బి తౌడన్న, టివికె రాజు, కృష్ణమూర్తి, నీలకంఠం, కె వి సత్యనారాయణ, పుల్లారావు, మరిడయ్య, వి ప్రసాద్, బి మహేష్, కె బాలశౌరి, మొహిద్దీన్, డి సత్యనారాయణ, కె ఆర్ కె రాజు, దుర్గాప్రసాద్, రాజు, పవన్, మహేష్, తిమోతీ బాబు పాల్గొన్నారు.

ములగాడ : సిఐటియు మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో63వ వార్డు క్రాంతినగర్‌లో భవన నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో మేడే ఉత్సవాల్లో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుంటే, రాష్ట్రంలోని అధికార వైసిపి, విపక్ష టిడిపి వంతపాడడం దుర్మార్గమన్నారు. షిఫ్ యార్డు,హెచ్‌పిసియల్, కోరమండల్, భవననిర్మాణ కార్మికసంఘం జివిఎంసి తోపుడుబళ్ల, ముఠా,విడిఆర్ కార్మికులు, ఐపియల్ శరత్‌చట్టర్జీ గోడౌన్స్, కాకరలోవ చింతల్లోవ క్రాంతినగర్ త్రినాధపురం దుర్గానగర్ ఎ ఎస్ ఆర్ కోలని నెహ్రూనగర్ ములగాడహౌసింగ్ కాలనీ, గుల్లలపాలెం మల్కాపురం ఆంధ్రస్టీల్ కాలనీ ప్రాంతాల్లో కార్మిక పతాకాన్ని ఆవిష్కరించారు. సిఐటియు మల్కాపురం జోన్ అధ్యక్ష కార్యదర్శులు కె.పెంటారావు ఆర్.లక్ష్మణమూర్తి, పి.పైడి రాజు వై.గంగాధర్ కె.రాము నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌టిఎల్‌లో..

కరాస : ఎన్ఎస్‌టిఎల్ సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జెఎన్. వర్మ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు.కాంట్రాక్టు కార్మికులను సత్కరించి దుప్పట్లు పంపిణీ చేశారు. యూనియన్ అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, సభ్యులు అలోక్‌కుమార్‌చంద్, గౌరవ్‌కుమార్ ప్రజాపతి, దీపక్‌కుమార్ పాశ్వాన్, కొళ్లి శ్రీనివాస్, నాగభూషణం, రోజాలిన్ మాలిక్, కె.ఈశ్వరరావు, కెఆర్. చంద్రశేఖర్, పి.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కంచరపాలెం: జోన్ పరిధిలో 34 చోట్ల సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు అరుణతాకాలను ఆవిష్కరించి, మేడేను జరుపుకున్నారు.కాన్వెంట్ జంక్షన్ ఆటో కార్మికులు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో కంచరపాలెం మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, సిఐటియు జోన్ అధ్యక్ష కార్యదర్శులు బి సింహాచలం ఓ అప్పారావు, ఎమ్ ఈశ్వరరావు, పి మూర్తి, జి శ్రీనివాసరావు, సత్యవతి, అనిల్, బాబురావు, హరి, వెంకటరమణ, లతీఫ్, వీరబాబు, సత్యనారాయణ, రాజు పాల్గొన్నారు

గాజువాక : 70వవార్డు దశమ కొండ సిఐటియు కార్యాలయం వద్ద మేడే పతాకాన్ని యూనియన్ గౌరవాధ్యక్షుడు నరసింగరావు ఆవిష్కరించారు యూనియన్ కార్యదర్శి లోవరాజు, ఐద్వా జిల్లా అధ్యక్షులు బి. పద్మ, రాజేంద్ర ప్రసాద్, కోటేశ్వరరావు, , దాలినాయుడు, పరదేశి నాయుడు, నాగేశ్వరావు, మంగ, కుసుమ పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుందామని ప్రతిజ్ఞ చేశారు. 65వ వార్డు భానోజీతోట సిఐటియు కార్యాలయం వద్ద మేడే వేడుకల్లో కార్యక్రమంలో ఆర్ నాగేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు, టి. శ్రీనివాస్, ఎం జ్యోతి పాల్గొన్నారు. కార్మికులు, విసిపి బాలలకు స్వీట్లు పంపిణీ చేశారు.

సమైక్య అపార్ట్‌మెంట్‌లో..


తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో కార్మిక దినోత్సవ సంబరాలు

తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్ వద్ద మేడేను పురస్కరించుకుని అరుణపతాకాన్ని భాస్కరరావు ఆవిష్కరించారు.కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వరరావు, ఎ.తవిటయ్య, తౌడన్న, రమణ, చౌదరి, మహిళా కమిటీ ప్రెసిడెంట్ మణిపాల్గొన్నారు..

తగరపువలస : చిట్టివలస సిఐటియు కార్యాలయం, వై జంక్షన్,ప్రైవేట్ మార్కెట్, ఎన్ఆర్ఐ రోడ్డు, ఆటో స్టాండ్ వద్ద సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రవ్వ నరసింగరావు, ఎస్ శ్రీనివాస వర్మ, రీసు. చిన్నారావు, కుప్ప రాంబాబు, జో గ వెంకటరావు, ఆనంద్, గుజ్జు నరసింగరావు, నీలాతి రాము, పి పెంటరాజు, నాయుడు, కానూరి రమణ పాల్గొన్నారు

ఎఐటియుసి ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డులో ఉన్న యూనియన్ కార్యాలయం వద్ద ఎర్ర జెండాను యూనియన్ నాయకులు అల్లు బాబూరావు, కె రాంబాబు, కొండపు ఈశ్వరరావు ఆవిష్కరించారు

భీమిలి: జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం, చిన్న బజారు జంక్షన్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద సిఐటియు నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ శ్రీనివాసవర్మ, ఎస్ అప్పలనాయుడు యూనియన్ జెండాలు ఆవిష్కరించారు

మధురవాడ : ద్రోణంరాజు కల్యాణ మండపం వద్ద 6,7 వార్డుల మున్సిపల్ కార్మికులు, క్యాబ్ డ్రైవర్లు సిఐటియు జెండా ఆవిష్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. మిధులాపురి వుడా కాలనీలో ఆటో కార్మికులు మజ్జిగ పంపిణీ చేశారు. వాంబేకాలనీలో శ్రీ కనకదుర్గ గణపతి మగధరమ్మ ఆటో సంఘం నాయకులు మేడే వేడుకల్లోఆధ్వర్యం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెఎం.కుమారమంగళం, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి రమేష్ జి చిన్నారావు, డి కొండమ్మపీ రాజ్ కుమార్ తది తరులు పాల్గొన్నారు.

కార్ షెడ్ జంక్షన్‌లో శ్రీ బబ్బేలమ్మ ఆటో సంఘం, మధురవాడ పిహెచ్‌సి వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం కనకరత్నం సిఐటియు జెండాను ఆవిష్కరించారు. సిపిఐ కార్యాలయం వద్ద సీనియర్ కమ్యూనిస్టు నేత కాంతమ్మ జెండా ఎగరవేశారు .మధురవాడ జంక్షన్ వద్ద నాగోతి సింగన్న జ్ఞాపకార్థం వారి కుమారుడు సూర్యప్రకాష్ మజ్జిగ పంపిణీ చేశారు.

ఆనందపురం: ఆనందపురం బ్రిడ్జి కింద బొడ్డపాలెం ప్లైవుడ్ కంపెనీ వద్ద, వేములవలస, బిపి కల్లాలు రోడ్డులో మేడే వేడుకలు జరుపుకున్నారు. సిఐటియు భీమిలి జోన్ జనరల్ సెక్రటరీ రవ్వ నర్సింగరావు, వర్మ, ముఠా కార్మికులు శరత్‌చంద్ర, అప్పల రాము, శివశంకర్, పైడి నాయుడు కృష్ణ, శంకర్, రమణ, పాల్గొన్నారు

సీతమ్మధార : అక్కయ్యపాలెం నరసింహ నగర్ రైతు బజార్ వద్ద చిల్లరవర్తకులు సంఘం నాయకులు పి సాయికుమార్ మేడే పతాకాన్ని ఆవిష్కరించారు ఎఐటియుసి రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు వామన మూర్తి, కె.శ్రీనివాసరావు జి సూర్యారావు, కె.గణేష్ ఏకాపు మహాలక్ష్మినాయుడు చంద్రావు, కేలం శివ పాల్గొన్నారు

పెందుర్తి : 95వ వార్డు జ్యోతి నగర్‌లో ఐద్వానేత బి. అనంతలక్ష్మి, శ్రామిక నగర్‌లో ఎన్ఎబిసి సంఘం అధ్యక్షులు అప్పారావు, 97వ వార్డు కార్మిక నగర్‌లో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జగన్ మేడే పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎర్రబాబు, మధు, కొండలరావు, చిరంజీవి పాల్గొన్నారు.

మాధవధార: మేడేను పురస్కరించుకుని మాధవ యువజన సమాజం ఆవరణలో సిపిఎం సీనియర్ నాయకులు సనపల ఆంజనేయులు, 48ఎ బస్‌స్టాప్ వద్ద వై సత్యనారాయణ కార్మిక జెండాను ఆవిష్కరించారు. సిపిఎం నాయకులు సనపల రాంగోపాలరావు, కూన వెంకటరావు, కె సుధాకరరావు, కూన సత్యనారాయణ, రైతు సంఘం నాయకులు నాయుడు బాబు, పప్పల రామచంద్రరావు, పి పాండురంగారావు, బి సూర్యారావు, కె.జనార్దన్ అమ్ము, కె పార్వతి, ఎస్ అములు, జి చిలకమ్మ పాల్గొన్నారు. పోర్టు ఎంట్రన్స్ గేటు వద్ద యునైటెడ్ పోర్ట్ అండ్ డాగ్ ఎంప్లాయిస్ యూనియన్ డాక్ లేబర్ బోర్డ్ యూనియన్లు సంయుక్తంగా కార్మిక జెండాను ఆవిష్కరించారు. యూనియన్ కార్యదర్శి కె సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామలింగేశ్వరరావు వర్కింగ్ ప్రెసిడెంట్ సిహెచ్ త్రినాధరావు, బి లక్ష్మణరావు, జగ్గనన సత్యనారాయణ పాల్గొన్నారు

ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల, ఆరిలోవ సిఐటియు కార్యాలయం, పలు ఆటోస్టాండ్‌ల వద్ద మే డే వేడుకలు నిర్వహించారు. జూపార్కులో కార్మికులు మేడే పతాకావిష్కరణ చేసారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి పి.మణి, ఆరిలోవ జోన్ అధ్యక్షులు పి.శంకర్రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆరిలోవ జోన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ, వి.నరేంద్రకుమార్, వై.అప్పారావు, రంగమ్మ, జూ పార్కు యూనియన్ నాయకులు నరేష్, నర్సింగరావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.


ఆరిలోవలో మేడే వేడుకల్లో సిఐటియు, ఐద్వా నేతలు

వైవికి జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి- సీతమ్మధార : వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వైవి సుబ్బారెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం రుషికొండ లోని ఆయన నివాసంలో ఉత్తర వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె రాజుకలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బాణాల శ్రీనివాసరావు ఉన్నారు. అలాగే వైవి. సుబ్బారెడ్డిని పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మేరువ గణేష్ దుశ్శాలువాతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


వైవికి జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న మేరువ గణేష్

గంజాయితో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలోని రేవిడి పంచాయతీ ఆనందాశ్రమం దగ్గర రాయల్ ఎన్‌యు లేఔట్‌లో గంజాయి ఉందన్న పక్కా సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసులు సంయుక్త దాడులు నిర్వహించారు. పాడేరుకు చెందిన అనిల్‌కుమార్, ద్వారకానగర్‌కు చెందిన పొట్నూరు వినోద్ పారిపోతుండగా, వారిని పట్టుకుని విచారించగా 40కిలోల గంజాయి పట్టుబడింది. నిందితులను అరెస్ట్‌చేసి భీమిలి కోర్టులో ప్రవేశపెట్టినట్లు పద్మనాభం పోలీసులు తెలిపారు.

పౌరాణిక నాటక కళాకారునికి పురస్కారం

ప్రజాశక్తి- ఆనందపురం: తేనె తెలుగు కల్చర్ ఛారిటబుల్ ట్రస్ట్ యూట్యూబ్ ఛానల్ వ్యవస్థాపకులు ఎస్ అంజనప్ప ఆధ్వర్యంలో పౌరాణిక నాటక కళాకారుడు ఉప్పాడ అప్పారావును కళాభిషేకం ప్రశంసాపత్రం అందించి సత్కరించారు. కార్యక్రమంలో పౌరాణిక నాటక నటులు సామవేదం బాలసుబ్రమణ్యం, లోకవరపు కృష్ణ ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

'బిల్డర్స్' మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి- వేపగుంట : 98వ వార్డు పద్మావతి ప్రైవేట్ కళ్యాణ మండపంలో బిల్డర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పలువురు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.రామరాజు, సెక్రెటరీ ఎల్.శ్రీనివాస్, ట్రెజరర్ రమణారెడ్డి, అజిత్, రమణ, శ్రీనివాస్, హరిప్రసాద్, సతీష్ పాల్గొన్నారు

వైసిపి విస్తృత ప్రచారం

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని కణమాం, భీమన్న దొరపాలెం కోలవానిపాలెం పంచాయతీల్లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ విజయాన్ని కాంక్షిస్తూ స్థానిక వైసిపి నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, వర్కింగ్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపిపి పాండ్రంకి శ్రీను, రామకృష్ణ, పినిశెట్టి సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

సమస్యలపై సిఎండికి వినతి


సమస్యలపై సిఎండికి వినతి

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వేతనాలను చెల్లించాలని, ప్లాంట్‌లో పూర్తిస్థాయి ఉత్పత్తికి చర్యలు చేపట్టాలని, బయోమెట్రిక్ హాజరులో సమస్యల పరిష్కారం, బార్స్ కమిటీ ప్రతిపాదనల ఆమోదం వంటి పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ప్రతినిధులు బుధవారం స్టీల్‌ప్లాంట్ సిఎండి అతుల్‌భట్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై సిఎండి స్పందిస్తూ ఈనెల 7నాటికి విశాఖ పోర్టుకు మరో రెండు కోల్ షిప్‌లు వస్తాయని, ఇనుప ఖనిజం నిల్వలు పెరిగాయని, ఈనేపథ్యంలో ఈనెల 10నుంచి పూర్తిస్థాయిలో ఉత్పత్తికి చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. రెండురోజుల్లో వేతనాలను చెల్లిస్తామన్నారు బార్స్ కమిటీ సిఫార్సులపై శుక్రవారం అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
విశాఖ, అనకాపల్లి
గురువారం
2 మే 2024

కలం మాట



అంతా ఏకమై ఓటెత్తాలి..!

రెండు అక్షరాల ఓటు
మూన్నాళ్ల ముచ్చట కానీకు
నలుగురిలో నీవు
తల యెత్తుకునేలా
ఐకమత్యంతో అర్హత కలిగిన
వారిని
ఆరు నూరైనా అందల మెక్కించుదాం
ఏడ్పుతో నిన్ను ఆకట్టుకుని
నీయంతటివాడు లేనేలేడని
ముసలి కన్నీళ్లు కార్చినంత
మాత్రాన
జాలి చూపకు
అవసరం తీరిన తర్వాత తమ
జూలు విదల్చడం ఖాయం
అన్నదమ్ములని,
అక్కచెల్లెల్లని,
తండ్రి కొడుకులను విడదీసే
విషం కక్కే కుళ్లు రాజకీయాలు
కాల గమనంలో కలసి పోవాలి
కుటుంబం అంతా ఏకమై
మనం అనుకున్న వారికి ఓటు వేయాలి
అదే పనిగా అరాచకం సృష్టించే
అవినీతి పరులకు బుద్ధి చెప్పే
అద్భుత అస్త్రం ఓటే
వివాదరహితుల
విజ్ఞాన వంతులను
ఎన్నిక చేసేది నీ ఓటే
ఈ రోజు నువ్వు పుచ్చుకునే
నోటు
పూటుగా తాగే మద్యం
నీకళ్లకు గంతలు కట్టేస్తాయి
నీ నోటికి తాళం వేసేస్తాయి
ఎవడో ఒకడు వస్తే ఏంటి
పోతే ఏంటని నీవనుకుంటే
నీవే కాదు వచ్చే తరాలు
సహితం
చైతన్యం లేని సమాజంలో
తెలియక కట్టబడిన ఇనుప
సంకెళ్లకు
దాసోహం కావాల్సిందే
దాహం,దాహం అంటూ
పొలికేకలు పెట్టాల్సిందే
ఇదే మంచి తరుణం
అవసరమైన విషయాల్లో
తలదూర్చడం మాని
మన భవిష్యత్తుకు బాటలు వేసే
మంచి వ్యక్తుల కోసం ఆలోచించు
అసలేం జరుగుతుందో గమనించు
నీవే శక్తి నీవే యుక్తి
కొండంత అండగా ఉండాల్సింది నీవే
విషాన్ని చిమ్మి, విద్వేషాలను
రెచ్చగొట్టే
వారికి సరియైన సమాధానం
చెప్పే వాడివి నీవే
దోమ కుడితేనే
దండయాత్ర
చేసి చంపేశావు
మరి నిన్ను నిరంతరం కుట్టి
చంపేవాడికి ఓటేసి నీనెత్తిపై
ఎలా కూర్చోపెట్టుకుంటావు
సరైన నాయకుడు రావాలి
మన అందరి కలలు నెరవేర్చాలి
పదండి కలసి ఓటేద్దాం
మనమేంటో నిరూపించుకుందాం

- సీతా సతీష్, కవి, రచయిత



తండ్రీ కొడుకులిద్దరూ విద్యాశాఖ మంత్రులే..


పివిజి.రాజు


ఆనందగజపతిరాజు

విశాఖ కలెక్టరేట్ : విజయనగరం సంస్థానాధీశులైన పివిజి.రాజు, ఆయన పెద్ద కుమారుడు పూసపాటి ఆనంద గజపతిరాజు భీమునిపట్నం శాసనసభ్యులుగా పనిచేశారు. ఇక వీరిద్దరూ రాష్ట్ర మంత్రులుగా పనిచేయడం ఒకెత్తయితే విద్యాశాఖనే చేపట్టడం మరో విశేషం. 1959 నవంబరులో అప్పటి ఎమ్మెల్యే జి.జగన్నాధరాజు ఆకస్మికంగా మృతిచెందారు. దీంతో 1960లో ఉప ఎన్నికలు జరిగాయి. అప్పటికే విశాఖపట్నం ఎంపీగా ఉన్న విజయనగరం సంస్థానాదీశుడు పివిజి.రాజు ఆ పదవికి రాజీనామా చేసి, భీమునిపట్నం అసెంబ్లీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. 1962, 1967 ఎన్నికల్లోనూ ఆయన ఇక్కడి నుంచే గెలిచి మూడుసార్లు విద్యాశాఖ మంత్రిగా పనిచేశారు. 1982లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. దీంతో పివిజి.రాజు పెద్ద కుమారుడు పూసపాటి ఆనంద గజపతిరాజు ఆ పార్టీలో చేరారు. 1983లో భీమునిపట్నం నుంచి అసెంబ్లీకి పోటీచేసి గెలుపొందారు. ఎన్‌టి.రామారావు మంత్రి వర్గంలో విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. భీమిలి నుంచి వేర్వేరు పార్టీల్లో గెలిచిన తండ్రీ తనయులు విద్యామంత్రులు కావడం విశేషం. అలాగే 2014లో ఇదే నియోజకవర్గం నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీచేసి నెగ్గిన గంటా శ్రీనివాసరావు కూడా చంద్రబాబు నాయుడు క్యాబినెట్‌లో విద్యాశాఖ మంత్రిగానే ఐదేళ్లపాటు పనిచేయడం మరొక విశేషం.



కాలుష్య నియంత్రణకు కృషి చేస్తా

సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడు ప్రచారానికి విశేష జనాదరణ


యారాడలో సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గునాయుడుకు హారతులిచ్చి స్వాగతిస్తున్న మహిళలు

ప్రజాశక్తి -గాజువాక : గంగవరం పోర్టు కాలుష్య నియంత్రణకు కృషి చేస్తానని ఇండియా ఫోరం బలపర్చిన సిపిఎం గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి ఎం జగ్గునాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం 64వ వార్డు యారాడ గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గునాయుడు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు ఉద్యమ పార్టీలు భాగస్వాములైన ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. యారాడ గ్రామంలో పట్టాల సమస్య పరిష్కారానికి, చెత్తపన్ను రద్దుకు సిపిఎం అండగా ఉండి పోరాటం చేస్తుందన్నారు. ప్రచారంలో కె.పెంటారావు, పైడిరాజు, కె.అప్పలరాజు, సోమేష్, ఆర్.విమల, కల్యాణి పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థి జగ్గునాయుడును గెలిపించాలని ప్రచారం

విశాఖపట్నం:కాంగ్రెస్, సిపిఐ, ఆమ్‌ఆద్మీ పార్టీలు (ఇండియా వేదిక) బలపర్చిన గాజువాక సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మరడాన జగ్గునాయుడును గెలిపించాలని కోరుతూ జివిఎంసి 86వ వార్డు ఫకీర్ తకియా, మిల్కిస్ వల్లిషా కాలనీ, ఎస్‌సి కాలనీ తదితర ప్రాంతాల్లో సిపిఎం ఆధ్వర్యాన బుధవారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ సుత్తి కొడవలి నక్షత్రం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. సిపిఎం నాయకులు ఎం.వెంకటేష్, ఆర్‌కె.నాయుడు, టి.అప్పలరాజు, ప్రజాశక్తి ఉద్యోగులు పాల్గొన్నారు.


స్థానికులను ఆత్మీయంగా పలకరిస్తున్న జగ్గునాయుడు

అండగా ఉంటా.. ఆదరించండి


పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న పశ్చిమ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్తి గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం :టిడిపి కూటమిని గెలిపించి, నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి పి.గణబాబు అన్నారు. బుధవారం 91 వార్డు పాతగోపాలపట్నంలో విస్తృతం ప్రచారం చేశారు. తన హయాలో రైల్వే అండర్ పాత్‌వే, గ్రామకంఠం భూములకు శాశ్వత పరిష్కారం చూపానన్నారు. ఆదరించి గెలిపిస్తే, అభివృద్ధికి అండగా ఉంటానని భరోసానిచ్చారు.

కళింగ వైశ్యుల సంఘీభావం

గోపాలపట్నం ప్రాంతానికి చెందిన కళింగ వైశ్య సంఘం సభ్యులు ఎమ్మెల్యే గణబాబుకు సంఘీభావం తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన సంఘంనాయకులు మధుసూధనరావు, దామోదరరావు, మిన్నారావు, గణేషు, జగదీష్, తదితరులు గణబాబును కలిసి, టిడిపి విజయానికి సహకరిస్తామని భరోసానిచ్చారు.

టిడిపిలో చేరికలు

90వ వార్డు వినోద్ నగర్, ఎన్ఎడి కొత్త రోడ్ ప్రాంతాలకు చెందిన పలువురు వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ ఆధ్వర్యంలో తెలుగుదేశంలో చేరారు. వీరికి ఎమ్మెల్యే గణబాబు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.టిడిపి వార్డు అధ్యక్షుడు ఎలమంచిలి ప్రసాదు,గణపతి, జయా సరస్వతి ఉన్నారు

విస్తృతంగా ఇండియా ఫోరం అభ్యర్థుల ప్రచారం

ప్రజాశక్తి- సీతమ్మధార : ఉత్తర నియోజక వర్గంలో ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పి.సత్యారావు, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి లక్కరాజు రామారావు విస్తృతంగా పర్యటించి, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీతంపేట వినాయక గుడి నుంచి ప్రారంభమైన ప్రచారంలో ప్రజల సమస్యలను తెలుసుకుంటా, వాటి పరిష్కారానికి భరోసానిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి సత్యారావు మాట్లాడుతూ, షర్మిల నాయకత్వంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తోందన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఇండియా ఫోరం అధికారం సాధిస్తే, ఎపికి ప్రత్యేక హోదా, స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వరంగ సంస్థలు ప్రయివేటుపరం కాకుండా పరిరక్షణ సాధ్యమన్నారు. ఫోరం ప్రచారానికి వస్తున్న ప్రజాదరణ చూస్తుంటే మంచి మెజార్టీతో విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వజ్జిపర్తి శ్రీనివాసులు, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి గుత్తల శ్రీనివాస్, పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు

జోరుగా చేరికలు.. ఆత్మీయ సమావేశాలు

ప్రజాశక్తి- సీతమ్మధార : విశాఖ ఉత్తర వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ప్రచారం జోరు పెంచారు. 45వ వార్డు తాటిచెట్లపాలెం 80 ఫీట్ రోడ్డులోని వార్డు ఎన్నికల కార్యాలయంలో కార్పొరేటర్ కంపా హనోక్ ఆధ్వర్యంలో దుర్గా వెజిటబుల్ మార్కెట్ సంఘం సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు వైసిపిలో చేరారు. బిజెపికి చెందిన 53వ వార్డు మాజీ ప్రెసిడెంట్ కె .భారతి ఆధ్వర్యంలో గిరిజరాణి, బంద, కరుణ, వినయ్, గోవిందరాజు, ప్రవీణ్, జగదీష్, యశ్వంత్, శ్రీనివాస్, ప్రసాద్, దిలీప్, కుమార్, రాజు తదితరులు పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి రాజు ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు.



గవరల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కెకె.రాజు

44వ వార్డు అబీద్‌నగర్ పార్కును కెకె రాజు సందర్శించారు వాకర్స్‌తో ముచ్చటించారు, వైసిపి అభ్యర్థులను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. 48వ వార్డులో వైసిపి ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. వార్డు పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు

వైసిపికి గవరల మద్దతు

మురళీనగర్ బొత్స స్క్వేర్ హాల్‌లో వైసిపి సీనియర్ నాయకులు బొడ్డేటి కాశీ విశ్వనాథం ఆధ్వర్యంలో గవర కులస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్,అనకాపల్లి జిల్లా వైసిపి అధ్యక్షులు బొడ్డేటి ప్రసాద్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజులకు వారి సమక్షంలో పలువురు గవరలు మద్దతు ప్రకటించారు.

కార్యక్రమాల్లో వైసిపి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి.ఆనంద్ కుమార్, వెజిటబుల్ మార్కెట్ సంఘం అధ్యక్షులు వెంకట సత్య నారాయణ, కార్యదర్శి రమణమ్మ, నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు , పైడి రమణ నీలి రవి, శివ గణేష్, ప్రకాష్, బొడ్డేటి. కిరణ్ కుమార్, వేగి సత్యనారాయణ, జగ్గయ్యమ్మ, ఆడారి అప్పారావు, సూరిశెట్టి లక్ష్మి, బొడ్డేటి తాతారావు పాల్గొన్నారు.

నాడు కలకలం రేపిన మాజీ ఎమ్మెల్యే హత్య..!

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

విశాఖ నగరానికి చెందిన ఒక మాజీ మహిళా ఎమ్మెల్యే దారుణంగా హత్యకు గురైన సంగతి నేటి తరంలో చాలా మందికి తెలియకపోవచ్చు. అయితే ఇది మాత్రం నిజం. విశాఖ - 1 అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ తరుపున గ్రంధి మాధవి పోటీచేసి గెలుపొందారు. అనకాపల్లికి చెందిన మాధవి న్యాయవాదిగా ఉంటూ అక్కడే కాంగ్రెస్ పార్టీలో ఉండేవారు. 1981లో అనకాపల్లి మున్సిపాలిటీకి జరిగిన ఎన్నికల్లో 28వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి చెందారు. 1983లో ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆమెకు విశాఖ - 1 నుంచి పోటీచేసే అవకాశాన్ని టిడిపి కల్పించింది. 1984 ఆగస్టు నెలలో నాదెండ్ల భాస్కరరావు అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావుపై తిరుగుబాటు చేశారు. అసెంబ్లీలో ఎన్‌టి.రామారావు కంటే తనకే ఎక్కువ మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని నాదెండ్ల భాస్కరరావు చెప్పడంతో అప్పటి రాష్ట్ర గవర్నర్ రామ్‌లాల్ విశ్వసించి రామారావు ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేశారు. నాదెండ్ల భాస్కరరావు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సమయంలో విశాఖ - 1 ఎమ్మెల్యే మాధవి నాదెండ్ల భాస్కరరావు శిబిరంలో చేరి ఆయనకు మద్దతు తెలిపారు. రాష్ట్ర వ్యాపితంగా ఎన్‌టి.రామారావుకు అనుకూలంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం ఉధృతంగా సాగిన నేపథ్యంలో అసెంబ్లీలో ఎమ్మెల్యేల బలం ఎన్‌టిఆర్‌కు



ఉందని రుజువైంది. దీంతో ఎన్‌టి.రామారావు నెల రోజులలోనే తిరిగి ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. కొద్ది రోజులలోనే ఆయన అసెంబ్లీని రద్దు చేశారు. దీంతో గ్రంధి మాధవి ఎమ్మెల్యే పదవిని కోల్పోయారు. ఆ తర్వాత నుంచి ఆమె అసెంబ్లీకి పోటీ చేయలేదు. హైదరాబాద్ వెళ్లి అక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని సొంతంగా ఒక బ్యాంకును స్థాపించి నడుపుతుండేవారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ కూకట్‌పల్లి ప్రాంతంలో ఆమె నివసిస్తుండేవారు. 2006 డిసెంబర్ 19న ఇంట్లోనే ఆమె హత్యకు గురయ్యారు. నగలు, నగదు కోసమే హత్య జరిగిందని పోలీసులు భావించారు. ఇంటి పని మనిషి హత్యకు కారకురాలని పోలీసులు గుర్తించి ఆమెను అరెస్టు చేశారు. విశాఖ జిల్లాకు చెందిన ఒక మాజీ మహిళా ఎమ్మెల్యే ఇలా హత్యకు గురైన సంఘటన అప్పట్లో సంచలనం కలిగించింది.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే హత్య

ఇదిలా ఉండగా విశాఖపట్నం జిల్లాకు చెందిన అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమలు 2018 సెప్టెంబర్ 23న మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన సంగతి అందరికీ తెల్సిందే. సర్వేశ్వరరావు 2014 ఎన్నికల్లో అరకు నుంచి వైసిపి అభ్యర్థిగా ఎన్నికై కొంత కాలానికే ఆ పార్టీని వీడి టిడిపిలో చేరారు. అయితే ఎమ్మెల్యే పదవిలో కొనసాగారు. ఆయనకు ప్రభుత్వ విప్ పదవి లభించింది. సివేరి సోమ 2009లో అరకు నుంచి టిడిపి అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యే అయ్యారు.

పశ్చిమంలో విమల విస్తృత ప్రచారం


ఇస్త్రీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి విమల

ప్రజాశక్తి -గోపాలపట్నం : ఇండియా ఫోరం బలపరిచిన పశ్చిమ సిపిఐ ఎమ్మెల్యే అభ్యర్థి అత్తిలి విమల వినూత్న ప్రచారంతో దూసుకుపోతున్నారు. కాంగ్రెస్, సిపిఎం, ఆమ్‌ఆద్మీ ఇతర ఫోరం పార్టీలతోపాటు భారత్‌బచావో, విద్యార్థి, యువజనసంఘాలతో కలిసి గోపాలపట్నం, రజక కాలనీ, పారిశ్రామిక ప్రాంతం శ్రీనివాసనగర్, ఉప్పరకొలని, అజంతా కోలని, కోడి పందేలా దిబ్బ తదితర ప్రాంతాల్లో బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలపై గేయాలు ఆలపిస్తూ, బిజెపి, వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచుతూ ప్రచారం సాగింది.. పశ్చిమ ఎమ్మెల్యేగా సిపిఐ అభ్యర్థి అత్తిలి విమలను కంకి కొడవలి గుర్తుపైనా, విశాఖ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి సత్యారావును హస్తం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా రజకుల వృత్తిదారుని ఇంటికి ప్రచారానికి వెళ్లిన విమల, ఇస్త్రీ చేస్తూ ఆకట్టుకున్నారు.

ఓటు ప్రాధాన్యతపై పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఓటు హక్కు ప్రాధాన్యతను తెలుపుతూ పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ముద్రించిన 'ఓట్ ఫర్ బెటర్ ఫ్యూచర్' పోస్టర్‌ను తన స్థానిక క్యాంప్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిఆర్‌ఎస్‌ఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ పిఎల్‌కె మూర్తి, జిల్లా అధ్యక్షులు నరసింహం, జాతీయ ఉపాధ్యక్షులు (సౌత్) శర్మ, సభ్యులు మార్టిన్, వైసిపి యువజన విభాగం ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త ముత్తంశెట్టి నందీష్‌బాబు, అవంతి ఇంజనీరింగ్ విద్యాసంస్థ ల మేనేజింగ్ డైరెక్టర్ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో కృషి చేస్తే విజయం


ఇంటింటా ప్రచారంలో వైసిపి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి

ప్రజాశక్తి -కరాస : క్షేత్రస్థాయిలో పటిష్ట ప్రణాళికతో పనిచేస్తే విజయం తథ్యమని వైసిపి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం కరాసలోని శ్రీ దుర్గా వేమన భవనంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వార్డు అధ్యక్షులు జియ్యాని మారుతి ఆధ్వర్యంలో 52వ వార్డు పార్టీశ్రేణులతో సమావేశం నిర్వహించి వారికి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలను, గడచిన ఐదేళ్లలో వైసిపి చేపట్టిన సంక్షేమాన్ని ఓటర్లకు వివరించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం పరిశీలకులు ఎస్ఎ రెహమాన్, పేడాడ రమణికుమారి, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ, వివిధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

91వ వార్డులో విస్తృత ప్రచారం

గోపాలపట్నం: జివిఎంసి 91వ వార్డు గోపాలపట్నం శివాలయం వీధి, బుద్ధ శివాజీ వీధి, గోపాలపట్నం మెయిన్ రోడ్డులలో వైసిపి నేత బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కేడర్, స్థానికులు ఆడారికి బ్రహ్మరథం పట్టారు. పశ్చిమ ఎమ్మెల్యేగా తనను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గునిశెట్టి శ్రీనివాసరావు, 92 వ వార్డు అధ్యక్షులు గొర్లె అప్పలస్వామి నాయుడు పాల్గొన్నారు.

వెంకట సూర్యనారాయణ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -మునగపాక

డిసిఎంఎస్ మాజీ చైర్మన్ యల్లపు వెంకట సూర్యనారాయణ సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. మండలంలో నాగులాపల్లి గ్రామంలో సూర్యనారాయణ 22వ వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా పాల కేంద్రంవద్ద సూర్యనారాయణ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పీఏసీఎస్ చైర్మన్‌గా, డీసీఎంఎస్ చైర్మన్‌గా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షునిగా, పాల సంఘం అధ్యక్షునిగా ఇలా పలు పదవులు చేపట్టిన సూర్యనారాయణ ప్రజలకు ఎన్నో సేవలను అందించారని కొనియాడారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. పాల కేంద్రం వద్ద సూర్యనారాయణ పేరుపై మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. నాగులాపల్లి గ్రామ మాజీ సర్పంచ్ యల్లపు వెంకట భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైరన్ మళ్ల ఉమామహేశ్వరరావు, ఉప సర్పంచ్ గోసాల గోవింద, భీశెట్టి వెంకట సత్యనారాయణ, దొడ్డి శివ, పొలమరశెట్టి నాగు, మొల్లేటి ఆదినారాయణ, భీశెట్టి రామకృష్ణ, పొలమరశెట్టి నూకాలయ్య, పెతకంశెట్టి రాజునాయుడు, కాండ్రేగుల చందు, మళ్ళ శివ బాబునాయుడు, భీమరశెట్టి భాస్కర్, భీశెట్టి కోటేశ్వరరావు, శరగడం సత్యనారాయణ, ఎల్లపు అభిమానులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి బైపాస్ ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మంద రాము ఆధ్వర్యంలో బైపాస్ రోడ్‌లో బుధవారం ట్రాఫిక్ ఎస్ఐ సోమశేఖర్ చేతుల మీదుగా మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వారు ఈ మజ్జిగ చలివేంద్రం ద్వారా దాహార్తిని తీర్చుకోవాలని సూచించారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన ముఠా వర్కర్స్ యూనియన్ను అభినందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మంద భవాని, ఎం పరదేశి, కె నాగేశ్వరరావు, కె రామకృష్ణ, ఎం వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

26 మంది గ్రామ వాలంటీర్లు రాజీనామా

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న 26 మంది గ్రామ వాలంటీర్లు బుధవారం వివిధ కారణాల వలన స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు ఎంపీడీవో అప్పలరాజు తెలిపారు. వారిలో కె కోటపాడు సచివాలయాల పరిధిలోని 20 మంది, గవరపాలెం ఒకరు, కెజె.పురం నుండి ఐదుగురు రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి -మునగపాక

దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు పార్టీ నిర్మాత, మార్క్సిస్ట్ యోధుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జయంతి కార్యక్రమంలో మండలంలోని తోటాడ సుందరయ్య గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు ఆళ్ల మహేశ్వరరావు మాట్లాడుతూ విలువలతో కూడిన నాయకుడిగా తన జీవితాన్ని త్యాగం చేసి ఎర్రజెండాను నిలబెట్టిన ఘనత సుందరయ్యకే దక్కుతుందని చెప్పారు. సుందరయ్య లాంటి మహోన్నత వ్యక్తుల ద్వారా నేటి యువత స్ఫూర్తి పొందాలన్నారు.



సుందరయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు, మహిళలు

దేశంలో నేటి రాజకీయ పరిస్థితులలో దేశానికి ఎర్రజెండా ఆవశ్యకతను తెలుసుకునే విధంగా ప్రజలు గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వివి శ్రీనివాసరావు, రాము, తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జయంతి సందర్భంగా, మేడే దినాన్ని పురస్కరించుకొని సిపిఎం నాయకులు నాగిరెడ్డి సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక కొత్తూరు జంక్షన్ వద్ద బుధవారం ఉచిత మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

తగరపువలస : ప్రముఖ కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య జయంతిని స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి సిపిఎం నాయకులు రవ్వ నరసింగరావు , ఎస్ శ్రీనివాసవర్మ తదితరులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

మెయిన్ రోడ్డులో వ్యక్తి దారుణ హత్య

నిందితుడిని అప్పగించాలని పోలీసు స్టేషన్ వద్ద బాధితుని బంధువులు ఆందోళన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట



అచ్చంనాయుడు (ఫైల్‌ఫోటో)

మండల కేంద్రంలో బుధవారం ఉదయం ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. జనసంచారం ఎక్కువగా ఉండే మెయిన్ రోడ్డులోనే హత్య జరగడం సంచలనం కలిగించింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం... బుచ్చయ్యపేట గ్రామానికి చెందిన తాటికొండ అచ్చం నాయుడు (39) బుధవారం ఉదయం తన ఇంటి వద్ద నుండి పొలానికి వెళుతుండగా, అదే గ్రామానికి చెందిన గన్నెడ్డి శ్రీను వెనుక నుండి వచ్చి కత్తితో అచ్చంనాయుడును నరికేశాడు. దీంతో అచ్చం నాయుడు అక్కడికక్కడే మృతి చెందాడు. హత్యకు పాల్పడిన నిందితుడు పోలీసులకు స్వచ్ఛందంగా లొంగిపోయాడు. మంగళవారం రాత్రి గన్నెడ్డి శ్రీనుకు, అచ్చన్నాయుడుకు మధ్య గొడవ చోటుచేసుకుంది. బుధవారం ఉదయం కూడా మరోసారి గొడవ జరిగింది. అనంతరం అచ్చం నాయుడు ఉదయమే ద్విచక్ర వాహనంపై పొలానికి వెళ్లడానికి ఇంటి నుంచి బయలుదేరి కొద్దీ దూరం రాగా శతకం పట్టు వద్ద అప్పటికే వేచి ఉన్న గన్నెడ్డి శ్రీను అచ్చన్నాయుడుడిని కత్తితో నరికివేసినట్లు స్థానికులు తెలిపారు.

అచ్చంనాయుడు హత్యకు గురి కావడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడును తమకు అప్పగించాలని గ్రామస్తులు పోలీస్ స్టేషన్‌ను చుట్టుముట్టారు. రెండు గంటల పాటు స్టేషన్ వద్ద ఆందోళన కొనసాగింది. పోలీసులు అచ్చంనాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించడానికి సిద్ధం కాగా గ్రామస్తులు, కుటుంబీకులు ఒప్పుకోలేదు. దీంతో కొత్తకోట సిఐ ఎల్.అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు జోక్యం చేసుకుని సర్దిచెప్పి గ్రామస్తులను అక్కడ నుంచి పంపించేశారు. మృతుడి కుమారుడు పవన్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇవిఎంల ర్యాండమైజేషన్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో ఈవియంల రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకులు దల్జీత్ సింగ్ మంగట్, డాక్టర్ పి.రాకేష్ కుమార్‌లు బుధవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. పార్లమెంటుకు పోటీ చేస్తున్న అభ్యర్థులు వారి ఏజెంట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో జిల్లా కేంద్రంలోని ఈవియం గొడౌన్‌లో మొదట విడతగా కంప్యూటర్ ద్వారా ర్యాండమైజేషన్ చేసి సీల్ చేయడం జరిగిందన్నారు. ఈవియంలను రెండో విడతగా కంప్యూటర్ ద్వారా ర్యాండమైజేషన్, బ్యాలెట్ యూనిట్ కంట్రోల్ యూనిట్ వివి ప్యాట్లను అభ్యర్థులు ఏజెంట్ల సమక్షంలో కంప్యూటర్ ద్వారా ర్యాండమైజేషన్ చేసి పోలింగ్ కేంద్రాలకు కేటాయించడం, బియులు, సియులు వివి ప్యాట్ 20 శాతం రిజర్వులో ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బి దయానిధి, అనకాపల్లి ఎంపీలుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు, వారి ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎన్నికల పరిశీలకులు, కలెక్టర్

కూటమి అభ్యర్థుల ప్రచారం



మాట్లాడుతున్న టిడిపి మాడుగుల అభ్యర్థి బండారు

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని బోయిలకింతాడ, కలిగొట్ల, గ్రామాల్లో బుధవారం మాడుగుల టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి కూటమి నాయకులతో కలిసి ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు వద్దకు వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పార్టీ సియర్ నాయకులు పైలా ప్రసాదరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైవాడ నీరును రైతులకు అంకితం చేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, పోతల పాత్రునాయుడు, కోమార బాబురావు, కొప్పాక కాసుబాబు, కిమిడి నాగేశ్వరరావు, చల్లా నానాజీ, దొగ్గ దేముడు నాయుడు, గొర్రెపోటు నరసింహమూర్తి, సొమిరెడ్డి గోవింద తదితరులు పాల్గొన్నారు.

జనసేన అభ్యర్థి కొణతాల ప్రచారం

అనకాపల్లి : జీవీఎంసీ 82వ వార్డు నర్సింగరావుపేట, దుర్గా లాడ్జి వీధి, బర్మా కాలనీ ప్రాంతాల్లో అనకాపల్లి జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి గాజు గ్లాసు గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా, కమలం పువ్వు గుర్తుపై ఓటేసి సిఎం.రమేష్‌ను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఎం రమేష్ తనయుడు రిత్విక్, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతతో ఆత్మీయ సమావేశం

కశింకోట : మండలంలోని నూతనగుంట పాలెం శివారు అచ్యుతపురం, జోగారావుపేట, నల్లమారమ్మ గుడి గ్రామాల్లో యువతతో మంగళవారం రాత్రి కూటమి నాయకులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం గ్రామ మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు నిమ్మదల సన్యాసి నాయుడు మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఉల్లింగల రమేష్, రమణ, గోవిందా, నాయుడు, బండారు రాము, అల్లం గంగా శీను, బండారు శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ టిడిపిలో చేరిక

బుచ్చయ్యపేట : మండలంలోని తైపురం మాజీ సర్పంచ్ నక్క శేషు బుధవారం టిడిపిలోనే చేరారు. టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజు ఆయన టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, నాయకులు తమరాన దాసు, కోట సత్యనారాయణ, మళ్లిరెడ్డి బుజ్జి, మనిషా సతీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నుండి జనసేనలో చేరిక

మండలంలోని పెదపూడి గ్రామానికి చెందిన పది మంది వైసీపీ కార్యకర్తలు జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి పివిఎస్ఎన్ రాజు సమక్షంలో జనసేనలో చేరారు. కార్యక్రమంలో గోకువాడ కోటేశ్వరరావు, ఉండ తాతారావు పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థి భరత్ కుమార్ విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి అసెంబ్లీ వైసిపి అభ్యర్థి మలసాల భరత్ కుమార్ బుధవారం స్థానిక జీవీఎంసీ 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్ ఆధ్వర్యంలో విలీనగ్రామం రాజుపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ తనను గెలిపిస్తే రాజుపాలెం ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొణతాల మురళీకృష్ణ, బొడ్డేడ శివ, కేఎం నాయుడు, డాక్టర్ బొడ్డేడ లక్ష్మీ నరసింహారావు, నకిరెడ్డి రాంబాబు, గొల్లవిల్లి చిరంజీవి, గొల్లవిల్లి రాజు, గొల్లవిల్లి త్రినాథ్, గుర్రం సత్యారావు, బొగ్గ నాగేంద్ర, సిద్ధిరెడ్డి సత్యారావు, పాతిన శ్రీను, నందవరపు శ్రీను, నందవరపు ప్రభాకర్, కొత్తపల్లి గణేష్, కొత్తపల్లి సన్యాసిరావు, నందవరపు సోమేష్, గొర్లి భీమేశ్వరరావు, ఎల్లపు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థులను గెలిపించండి

మే13న జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన యువకుడు మలసాల భరత్‌కుమార్‌ను, స్థానికుడు, సౌమ్యుడైన బూడి ముత్యాలు నాయుడుని ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలిపించాలని కోరారు. సమావేశంలో ఏడువాకుల నారాయణరావు, కాండ్రేగుల రాము, కృష్ణపరమాత్మ, మండల సత్యనారాయణ, తోకల రామారావు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన నుండి వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం మండలం గంధవరం గ్రామానికి చెందిన టిడిపి, జనసేన పార్టీల నుండి 40 మంది వైసిపిలో బుధవారం చేరారు. వార్డు మెంబర్ ఎలమంచిలి శ్రీను, పళ్ళ అప్పలనాయుడు, పళ్ళ ఈశ్వరరావు, రామకృష్ణ, వెంకటేశ్వరరావు, పల్ల కళ్యాణ్, పల్ల మోహన్‌తో పాటు 40 మందికి వైసిపి చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ వైసిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పల్లా నర్సింగరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



వైసిపిలో చేరిన వారితో ఆ పార్టీ అభ్యర్థి కరణం ధర్మశ్రీ

బిజెపి అభ్యర్థులను ఓడించాలి

- నిజాయితీపరులను గెలిపించండి-ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని

ప్రజాశక్తి-మాడుగుల: నిజాయితీపరులైన అభ్యర్థులను గెలిపించాలని ప్రత్యేక హెూదా విభజన సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం మాడుగులలో నిర్వహించిన ఆంధ్రుల హక్కులు ఆత్మగౌరవ పోరాట యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వతంత్ర అభ్యర్థులైన రాజకీయ పార్టీలైనా సరే నేటి సమాజ అభివృద్ధికి నిజాయితీపరులు ఎంతో అవసరం అన్నారు. రాష్ట్రానికి మోసం చేసిన బిజెపి అభ్యర్థులను ఓడించాలన్నారు. భావితరాల భవిష్యత్తుకై ఓటు అనే ఆయుధంతో మంచి వ్యక్తులను ఎన్నుకుందామన్నారు. ఉత్తరాంధ్రకు అన్యాయం చేసిన పాలకులను ఓడిద్దాం ప్రత్యేక హెూదా సాధన తోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. రాష్ట్రాన్ని దగా చేసిన బిజెపి ఇప్పటికైనా తన విధానాలు మార్చుకుని, విభజన హామీలు ప్రత్యేక హెూదా అమలు చేసి పది సంవత్సరాలలో బడ్జెట్లో చేసిన అన్యాయాలు వెంటనే సరిచేయాలన్నారు. ఇప్పటివరకు ప్రత్యేక హెూదా, విభజన హామీలకు కట్టుబడి నిరంతరం పోరాటం చేసిన పార్టీలో వామ పక్షాలేనన్నారు. దగా చేసిన బిజెపిని నమ్మవద్దని,. దగాపడ్డ ఆంధ్రులారా ఇకనైనామేల్కొనండి.. . భావితరాల భవిష్యత్తుపై పోరాడుదామన్నారు.విశాఖ స్టీల్ ప్లాంట్ ను రక్షించుకుందామన్నారు. వలసల నివారణకు చర్యలు తీసుకోకుండా దగా చేస్తున్న పాలకులను ఓడించాలని పిలుపునిచ్చారు. కోట్ల విలువ చేసే సెమీ కండక్టర్ల పరిశ్రమలు గుజరాత్కు తీసుకెళ్తూ దేశ సంపదనంతా ఒక్క గుజరాత్ లోని అభివృద్ధికి కేటాయిస్తూ ఆంధ్రకు అన్యాయం చేస్తున్న బిజెపిని ఓడిద్దామన్నారు.

ఆంధ్ర మేధావుల ఫోరం అధ్యక్షులు ఆచార్య గొలివె అప్పలనాయుడు మాట్లాడుతూ, రాష్ట్రంలో అధికార ప్రతిపక్ష పార్టీలు బిజెపికి దాసోహం అయ్యాయని అన్నారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఉత్తరాంధ్రలో స్థాపించకుండా ద్రోహం చేస్తున్న పాలకులను ఓడించాలన్నారు. ఆదర్శవంతమైన భావాలు కలిగిన అభ్యర్థులు స్వతంత్ర, రాజకీయ పార్టీలకు చెందిన వారు ఎవరైనా సరే వారికి ఓటు వేసి జాతిని మేల్కొల్పుదామన్నారు.

రాష్ట్ర యువజన జేఏసీ అధ్యక్షులు ప్రతిపాటి బుల్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగాలు లేక యువత నిరుద్యోగ సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. దగా పడ్డ యువత మేలుకోండి మన భవిష్యత్తు మన చేతుల్లోనే.. నిజాయితీపరులైన రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులకే ఓటు వేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు డివిజన్ కార్యదర్శి రొంగలి దేముడునాయుడు, ఆదివాసి గిరిజన సంఘం ఐదవ షెడ్యూల్ సాధన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరట నరసింహమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్


ప్రచారం చేస్తున్న అభ్యర్థి ధర్మశ్రీ

వైసిపితోనే అభివృద్ధి, సంక్షేమం : ధర్మశ్రీ

ప్రజాశక్తి-కొత్తకోట:రాష్ట్రంలో అభివృద్ధి- సంక్షేమం కొనసాగాలంటే వైసీపీ ప్రభుత్వాన్ని బలపరచాలని చోడవరం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ కోరారు. రావికమతం మండలం దొండపూడిలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ధర్మ శ్రీ మాట్లాడుతూ, గత 59 నెలలుగా రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేశారని గుర్తు చేశారు. తిరిగి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు టిడిపి జనసేన బిజెపి కూటమి అమలు కాని హామీలతో ప్రజలను వంచన చేసేందుకు ప్రయత్నాలు ముమ్మ రం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో దొండపూడి సర్పంచ్ మరువాడ రాజులమ్మ, ఉపసర్పంచ్ గ్రేడ్ రాజారావు, మాజీ సర్పంచ్ తాతబాబు, రామ్ నాయుడు పలువురు గ్రామస్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజు

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి - కొత్తకోట:చోడవరం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే టిడిపి జనసేన బిజెపి కూటమి అభ్యర్థులను బలపరచాలని చోడవరం నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కే ఎస్ ఎన్ ఎస్ రాజు అన్నారు. రావికమతం మండలం కొత్తకోట గ్రామ సమీపంలో బుధవారం టిడిపి, జనసేన, బిజెపి ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, అనకాపల్లి జిల్లాలో చోడవరం నియోజకవర్గం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పన కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టిడిపి కూటమి ఆధ్వర్యంలో విడుదలైన మేనిఫెస్టోకు మంచి స్పందన లభించిందని పేర్కొన్నారు. 25 కుటుంబాలు, యువకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే అభ్యర్థి రాజు సాధర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాజాన కొండ నాయుడు, కొత్తకోట మాజీ సర్పంచ్ కోట నీలవేణి గోవిందరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు ఉగ్గిని శ్రీను, కోట సత్తిబాబు వే పా రామకష్ణ, మాజీ ఎంపీటీసీ బంటు శ్రీను పలువురు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో వ్యక్తి హత్య

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:మండల కేంద్రంలోని నూతనంగా నిర్మిస్తున్న తహసిల్దార్ కార్యాలయ భవనంలో ప్లాస్టిక్ వ్యర్థలు సేకరించే ఓ వ్యక్తి బుధవారం హత్యకు గురయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు అరకు సీఐ రుద్రశేఖర్ , స్థానిక ఎస్సై సంతోష్ కుమార్ సంఘటన స్థలంలో చేరుకుని పరిశీలించారు. మృతుడు ఎస్ కోట మండలం రాజిపేట గ్రామానికి చెందిన బత్తిన శివ శ్రీనివాస్ గా గుర్తించారు. మృతుడు ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరిస్తుంటారన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. హత్యకు గల కారణాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.


పరిశీలిస్తున్న సిఐ

గోపాలమిత్రల హర్షం

ప్రజాశక్తి- అనకాపల్లిడెస్క్:పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న రాష్ట్ర గోపాలమిత్రలను గుర్తిస్తూ తెలుగుదేశం పార్టీ కూటమి మేనిఫెస్టోలో చేర్చడంపై గోపాల మిత్రలు హర్షం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే బుధవారం అయ్యన్న తనయుడు, మున్సిపల్ కౌన్సిలర్ రాజేష్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర గోపాలమిత్ర యూనియన్ నాయకులు కిల్లాడ వెంకటరమణ మీడియాతో మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న గోపాల మిత్రులను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం పాడి రైతులకు అండగా ఉంటూ పాడి పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటు ఇచ్చిందని, జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పాడి పరిశ్రమ పూర్తిగా నిర్వీర్యం అయిందన్నారు. వైయస్.రాజశేఖర్ రెడ్డి , కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా చేసిన సమయంలో గోపాల మిత్రులకు గౌరవ వేతనాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న అనేకమంది ఎమ్మెల్యేలను మంత్రులను ఎన్నోసార్లు కలిసినప్పటికీ ప్రయోజనం లేదని దీంతో ఇటీవల నారా లోకేష్ను కలిసినప్పుడు గోపాల మిత్రులకు న్యాయం చేస్తానని మాట ఇచ్చారని, ఈ మేరకు మేనిఫెస్టోలో ప్రవేశపెట్టడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.


పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న గోపాలమిత్రలు

టిడిపి హయాంలో కాపులకు న్యాయం

ప్రజాశక్తి -నక్కపల్లి :తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే కాపులకు న్యాయం జరిగిందని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. నక్కపల్లి లో క్రిష్ టౌన్ షిప్ నందు పాయకరావుపేట నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో బుధవారం ఆమె స్వగృహం నందు నియోజకవర్గ కాపుల ఆత్మీయ సమావేశం జనసేన నేత తోట నగేష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా కాపు నేత వంగా రంగ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు .అనంతరం జరిగిన సమావేశంలో గంటా మాట్లాడుతూ, 1999లో అనకాపల్లి పార్లమెంటు నుండి తాను పోటీ చేసినప్పుడు నుండి నేటి వరకు పాయకరావుపేట నియోజకవర్గం నుండి తనకు విడదీయలేని అనుబంధం ఏర్పడిందన్నారు. 2014 సంవత్సరంలో టిడిపి మేనిఫెస్టోలో కాపుల కోసం ఇచ్చిన 4 హామీలను చంద్రబాబునాయుడు అమలు చేయడం జరిగిందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ,జనసేన నాయకులు తోట నగేష్ ,పాయకరావుపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి గెడ్డం బుజ్జి మాట్లాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, చిట్టిబాబు, అబద్ధం, జానకి శ్రీను పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

లొంగిపోయిన హత్య కేసు నిందితుడు

ప్రజాశక్తి-పెదబయలు :సీతగుంట పంచాయతీ పెదబయలు మాజీ సర్పంచ్ ఇంట్లో గత శనివారం రాత్రి వర్తనపల్లి గ్రామానికి చెందిన శోభ హేమరాజు హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితుడు పల్లుల సుందర్రావు (అప్పారావు) నేరుగా పోలీసు స్టేషన్కు వెళ్లి లొంగిపోయాడు. సిఐ విచారణ చేసి నిందితుడిని రిమాండ్ కు తరలించారు.

తవ్వేసారు..వదిలేశారు..

ఇదీ జల్‌జీవన్ పనుల పరిస్థితి

ప్రజాశక్తి- చీడికాడ:జల జీవన మిషన్ పనుల్లో భాగంగా ఇంటింటి కొళాయిలకు జెసిబిలతో తవ్వారు. ఇంటింటి కొలాయి కలెక్షన్ ఇవ్వకుండా అలాగే గాలికి వదిలేసారు. దీంతో వృద్దులు చిన్న పిల్లలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. చీడికాడ మండల కేంద్రంలో పాత ఎమ్మార్వో ఆఫీస్ నుండి మంచాల గ్రామం రోడ్డు బీసీ కాలనీ మెయిన్ రోడ్ లో జల జీవన్ మిషన్ పనుల్లో భాగంగా గతవారం రోజుల క్రిందట తవ్వకాలు చేపట్టారు. ప్రతి ఇల్లుకి మాత్రం కనెక్షన్ ఇవ్వకుండా తవ్విన దాన్ని అలాగే గాలికి వదిలేసి వెళ్లిపోయారని కాలనీ వాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు అంతేకాకుండా ఈ రోడ్డుపై నిరంతరం లారీలు, ట్రాక్టర్లు, బస్సులు ప్రయాణం చేస్తుండడంతో అవి వచ్చేటప్పుడు తప్పు కోవడానికి కనీసం దారి లేకుండా అనేక ఇబ్బందులు పడుతూ కొన్ని సమయాల్లో ప్రమాదాలకు దారి తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.



తవ్వి వదిలేసిన మార్గం

ఇవిఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

ప్రజాశక్తి-అరకులోయ:అరకు అసెంబ్లీ నియోజక వర్గంలో ఈవిఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసామని అరకు అసెంబ్లీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి, ఐటిడిఎ పిఓ వి.అభిషేక్ తెలిపారు. బుధవారం అరకులోయ తహశీల్దార్ కార్యాలయంలో జనరల్ పరిశీలకులు కె.వివేకానందన్, వివిద రాజకీయ పార్టీల అభ్యర్దులు, జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ఆదేశాల మేరకు ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు.ఈనెల 29వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి కావడంతో ఎన్నికల బరిలో 17 మంది అభ్యర్దులు నిలిచారు. అరకు నియోజక వర్గం పరిధిలోని 304 పోలింగ్ కేంద్రాలకు అసెంబ్లీ అభ్యర్దులకు ఒక బ్యాలెట్ యూనిట్, ఎంపి అభ్యర్థులకు ఒక బ్యాలెట్ యూనిట్ అవసరం ఉంటుందని భావించారు. కాని అనూహ్యంగా 17 మంది నిలవబడటంతో మరో బ్యాలెట్ యూనిట్ ఏర్పాటు అవసరం ఉండటంతో అదనంగా బ్యాలెట్ యూనిట్లను ఎన్నికల అధికారులు సమకూర్చడం జరిగింది. ఎన్నికల పరిశీలకులు కె.వివేకానందన్ స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. ఈవిఎంల పంపిణీకి చేపడుతున్న చర్యలను అడిగి తెలుసు కున్నారు.

ఘనంగా మేడే వేడుకలు



అనకాపల్లిలో మేడే వేడుకలు నిర్వహిస్తున్న నేతలు, కార్మికులు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

మే డే వేడుకలను జిల్లాలోని కార్మికులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చోట్ల ఎర్ర జెండాలను ఎగురవేశారు.

అనకాపల్లి:అనకాపల్లిలోని పలుచోట్ల సిఐటియు ఆధ్వర్యంలో మేడే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సిఐటియు అనుబంధ కార్మిక సంఘాల నాయకులు ఆయా కార్యాలయాల వద్ద జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు, మండల నాయకులు గంట శ్రీరామ్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేస్తుందని, ప్రజల ఆస్తిని కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలపై విపరీత భారాల వేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమాల్లో సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు కరణం కొండారావు, ఏసు, బొమ్మల రాము, కొణతాల నందేశ్వరరావు, నుక అప్పారావు, మంద రాము, పరదేశి, ఆర్ తాతబాబు, బోడి రాజు, కాపు శెట్టి అప్పారావు, భీశెట్టి అప్పారావు, కాళ్ళ తేలయ్యబాబు పలకా సత్యనారాయణ, పిఎన్‌వి పరమేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం, గాంధీ చౌక్, కొత్తూరు, మామిడిపాలెం తదితర ప్రాంతాల్లో సిపిఐ, ఎఐటియుసి నాయకులు బాలేపల్లి వెంకటరమణ, దొరబాబు, వైఎన్.భద్రం, మామిడిపాలెం బవులవాడ, గుంకల్లోవలో ఎఐఎఫ్‌టియు నాయకులు కోన మోహన్ జెండాలను ఆవిష్కరించారు.

మునగపాక : మునగపాక, చూచుకొండ, తోటాడ, వెంకటాపురం గ్రామాలలో సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు మేడే జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, సంఘాల నాయకులు రామలక్ష్మి, ఎస్ బ్రహ్మాజీ, వ్యకాస నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, సాయి, జయలక్ష్మి, సరస్వతి పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ ఫార్మసిటీలో విజయశ్రీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.మల్లేశ్వరరావు, వెంకటేశ్వరరావు, సంతోష్, కె.రమణ, గనిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు. పరవాడ మండల కేంద్రం ఎమ్మార్వో ఆఫీసు జంక్షన్లో సిఐటియు నాయకులు వై.బాబురావు పతాక ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు చీపురుపల్లి ప్రసాద్, జే చిట్టిబాబు, గేదెల అప్పారావు పాల్గొన్నారు.


చోడవరంలో...

సబ్బవరం : మేడే దినోత్సవంలో సిపిఎం మండల కార్యదర్శి ఉప్పాడ సత్యవతి కార్మిక పతాకాన్ని ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికుల సమస్యల పట్ల కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు గొంతిన అప్పారావు(చంటి), పూడి అప్పలనాయుడు, వివి.రమణమ్మ, కళ్యాణి, సిపిఎం నేతలు మొల్లేటి గౌరీశ్వరరావు, పప్పుల కోటి, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దేవరాపల్లి : స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్, తహశీల్దార్ కార్యాలయం జెండాలను ఎగురవేశారు. సిఐటియు నాయకులు కె.సూరిబాబు, జి.వరలక్ష్మి, వ్యకాస నాయకులు డి.వెంకన్న, బిటి దొర మాట్లాడారు. కార్యక్రమంలో అనుబంధ సంఘాల నాయకులు ప్రసాద్, నమ్మి దేముళ్ళు, నర్సిమ్మ, పోటేల ఈశ్వరావు, పద్మ, సృజన, సిహెచ్.అప్పారావు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఉపాధి హామీ పనుల వద్ద కూలీలతో కలిసి మేడే జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎస్‌వి నాయుడు, సాంబశివరావు పాల్గొన్నారు.

వడ్డాది : బుచ్చయ్యపేట మండలం వడ్డాది, బంగారు మెట్ట, లోపూడి గ్రామాల్లో జెండాలు ఎగురవేశారు. వ్యకాస నాయకులు పెనుపాత్రుని సాంబశివరావు, ప్రేమ్ చంద్రశేఖర్, ఎస్‌వి నాయుడు ఎస్ఎఫ్ఐ శ్రీను, ఆనంద, భాస్కరరావు శయ్యపురెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలోని కొత్తపట్నం, ఎన్ఏఓబి గేట్, రాంబిల్లి, వైలోవ, పెద్ద కలవలపల్లి, వెల్చూరు, మామిడివాడ, దార భోగాపురం, వెంకటాపురం కేంద్రాల్లో సిఐటియు ఆధ్వర్యాన మేడే పతాకావిష్కరణలు జరిగాయి. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.దేవునాయుడు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చోడవరం : సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ, విద్యుత్తు కార్యాలయం వద్ద జెండాలను ఆవిష్కరించారు. ఎఐటియుసి, ఎఐఎఫ్‌టియు ఆధ్వర్యాన వేర్వేరుగా మేడే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా సంఘాల నాయకులు ప్రేమ చంద్రశేఖర్, వేపాడ సత్యనారాయణ, గూనూరు వరలక్ష్మి, కోన మోహన్, రెడ్డిపల్లి అప్పలరాజు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడు మూడు రోజుల కూడలి, ఆనందపురం, గొండుపాలెం, చౌడువాడ తదితర గ్రామాల్లో సిఐటియు ఆధ్వర్యాన జెండా ఆవిష్కరణలు చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఈ.నాయుడు బాబు, ఎర్ర దేవుడు వనుము సూర్యనారాయణ, జి కుమారి, పి భవాని, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోటలో సిఐటియు అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యాన మేడే జెండా ఆవిష్కరణలు చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఎం.నాగశేషు, తనుజ, శ్యామల, మజ్జి రమణ, చెన్న, రాంబాబు, ఎం .శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిడెస్క్:నర్సీపట్నంలో సిఐటియు అద్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను వాడ వాడల ఘనంగా నిర్వహించారు. ముందుగా కృష్ణాబజార్ సెంటర్‌లో ముఠా కార్మిక సంఘం అద్వర్యంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు జెండా ఆవిష్కరించారు. జిసిసి ఆటో స్టాండ్, ఇందిరా మార్కెట్ ముఠా, కాఫీ క్యూరింగ్ సెంటర్, శివపురంలో శ్రీసిద్ధి వినాయక మార్బల్స్, టైల్స్, శ్రీఅభయాంజనేయ భవన నిర్మాణ కార్మిక సంఘం, పీనారిపాలెం, బలిఘట్టం, రామారావుపేట సిఐటియు కార్యాలయంతో పాటు చెట్టుపల్లి, వేములపూడి, ఎలక్ట్రికల్ డివిజన్ కార్యాలయాలంలో జెండా అవిష్కరణలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు ఎల్.గౌరి, టి.ఈశ్వరరావు, కె.ప్రసన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు కె.రామకృష్ణ, ఎస్.సత్తిబాబు, కె.శ్రీనివాసరావు, రమణ, సత్తిబాబు, ముఠా కార్మిక సంఘం రుత్తల గోవింద్, కె.నానాజీ, ఎం.రమణ, అప్పారావు, అంగనాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వి.సామ్రజ్యం, రమణమ్మ, నాగరమణి, శ్రీనూకాంబిక ఆటో యునియన్ నాయుకులు ప్రెసిడెంట్, కోశాదికారి సత్తిబాబు తదితర్లు పాల్గొన్నారు.నర్సీపట్నం భారతీయ జీవిత బీమా సంస్థ ప్రాంగణంలో మేడే వేడుకలు నిర్వహించారు.


నర్సీపట్నంలో...

కొత్తకోట:రావికమతం మండలంలో కార్మిక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు కొత్తకోటలో సిఐ టియు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె.గోవిందరావు, శ్రీ శాంతి ఆటో యూనియన్ అధ్యక్షులు బి.బుల్లిబాబు, సిద్ధి వినాయక ఎలక్ట్రికల్ అండ్ ప్లంబర్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పూడి అర్జునరావు, అంగన్వాడీ యూనియన్, అధ్యక్షులు సత్యవేణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో శ్రీ శాంతి ఆటో యూనియన్, అంగన్వాడీ కార్యకర్తలతో పాటు గౌరీ శంకర, సిద్ధి వినాయక హమాలీ సంఘం సభ్యులు మహేష్, రాజు, డి.సత్తిబాబు, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు...

మాడుగుల: మాడుగులలో సిఐటియు ఆధ్వర్యాన నిర్వహించారు. అంగనవాడి. ఆటో, రిక్షా. వ్యవసాయ కార్మికులు బస్సు కాంప్లెక్ష్ వద్ద మే డే జెండా ఆవిష్కరణ చేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు ఇ నరసింహమూర్తి మాట్లాడుతూ, మే డే స్ఫూర్తితో కార్మికులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలుకై పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నేతలు రామలక్ష్మి, సన్యాసమ్మ, పద్మావతి, రిక్షా యూనియన్ కొండబాబు రాజు, బాలరాజు, మోదకొండ ఆటో యూనియన్ సభ్యులు మురళి, కే మల్లేష్, మధు పాల్గొన్నారు


గొలుగొండలో..

గొలుగొండ:కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉండి పోరాటాలు చేయాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని చోద్యం మెయిన్ రోడ్‌లో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు మేకా భాస్కరరావు, జి.రాధాకృష్ణ, నాయకులు లగుడు బాబులు, మాకిరెడ్డి సత్యనారాయణ, రాంబాబు పాల్గొన్నారు.

జోగుంపేట కూడలిలో భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు బుంగా రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు.

రోలుగుంట:ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను బుధవారం రోలుగుంటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సిపిఎం నాయకులు ఈర్లె చిరంజీవి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం మేడే అన్నారు. మేడే స్ఫూర్తితో అందూ పోరాడాలన్నారు.

చీడికాడ:మండల కేంద్రంలో సిఐటియు నేత ఆర్.దేవుడు నాయుడు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాలు జానకి, పి.కామాక్షి ఆధ్వర్యంలో మండలంలో పలు చోట్ల జెండా ఎగరవేసి కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా దేవుడునాయుడు మాట్లాడారు.


మాడుగులలో..

జోరుగా వైసిపి అభ్యర్థి గణేష్ ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం మున్సిపాలిటీ 12వ వార్డులో బుధవారం నర్సీపట్నం ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో ఏ విధంగా మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చారో అదే విధంగా 2024 ఎన్నికల్లో అదే విధంగా మోసేందుకు టిడిపి వస్తుందన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కేవలం రెండు పేజీలతో మ్యానిఫెస్టోను విడుదల చేశారన్నారు. గత ఐదేళ్లలో ఏ విధంగా రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారో అదే విధంగా కొనసాగిస్తారన్నారు. రాబోయే రోజుల్లో నర్సీపట్నం మున్సిపాలిటీలో 10వేల మెజార్టీ, నియోజకవర్గం మొత్తం మీద 30వేల మెజార్టీతో గెలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్‌లు చింతకాయల సన్యాసిపాత్రుడు, గొలుసు నరసింహమూర్తి, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఏకా శివ తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

అనకాపల్లిడెస్క్:మాకవరపాలెం మండలం బూరుగుపాలెం సర్పంచ్ గోపాల్ రెడ్డి వెంకటరమణ బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు పెద్ద సంఖ్యలో అనుచరులతో పాటు పలువురు వార్డు మెంబర్లు కూడా పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నర్సీపట్నం సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రుత్తల ఎర్రాపాత్రుడు, చింతకాయల సన్యాసిపాత్రుడు, మండల వైసిపి అధ్యక్షులు రుత్తల వాసు, మండల పరిషత్ అధ్యక్షుడు రుత్తల సత్యనారాయణ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పార్టీలోకి భారీగా చేరికలు

హీరో సాయిరామ్ శంకర్ ఎన్నికల ప్రచారం

గొలుగొండ:నర్సీపట్నం వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ సోదరుడు, సినీ హీరో సాయిరామ్ శంకర్ బుధవారం మండలంలోని గాదంపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ వైసీపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, వైసీపీ మండల అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.


ప్రచారం చేపడుతున్న గణేష్